# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 83 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 6 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి





రైతుల కోసం కాకుండా

## కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జులై 5 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను రైతుల కోసం కాకుండా కమీషన్ల కోసమే నిర్మించిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లలో ప్రాజెక్టుల పేరిట రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం డిజైన్ చేసింది.. కట్టింది.. కూలింది.. ఆ పార్టీ హయాంలోనేనని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లు నాశనం చేసి ఇప్పుడు నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పిదాల వల్లే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు పనికిరాకుండా పోయాయన్నారు. సచివాలయంలో జలవనరులశాఖ అధికారులతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. "మూడు బ్యారేజీల్లో నీరు నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చెప్పింది. ఫౌండేషన్‌లో లోపాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుందని.. భద్రాచలంతో పాటు పలు గ్రామాలు మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పారు. బీఆర్ఎస్ నేతల కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. కమీషన్ల కోసమే ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారు. ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయని భావించారు. ప్రాజెక్టు సరిగా నిర్మించి ఉంటే వినియోగించేందుకు మాకు అభ్యంతరం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దింపే పరిస్థితి లేదు. గేట్లు దింపి నీరు నిల్వ చేయకుండా ఎత్తిపోయలేం. ప్రాణహిత–చేవెళ్లపై రూ.11వేల కోట్లు ఖర్చు చేశాక ప్రాజెక్టును మార్చారు. రీడిజైనింగ్ చేసిన కొత్త ప్రాజెక్టు పూర్తికి రూ.1.20లక్షల కోట్లు అవసరమని కాగ్ ఆనాడే చెప్పింది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

మెట్రో ప్రాజెక్టుపై ఢిల్లీలో జరిగిన భేటీ నిర్ణయాలు

# అమలు కావడం లేదు

### జాప్యం వల్ల ప్రాజెక్ట్ వ్యయం పెరిగే ప్రమాదం

### సీఎం రేవంత్ అసంతృప్తి... కేంద్రమంత్రులకు లేఖలు

**హైదరాబాద్, జులై 5 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాశారు. గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని సీఎం కోరారు. షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయని, వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి లేఖల్లో కోరారు.ఇటీవలే కేంద్రమంత్రులతో భేటీ అయిన సీఎం : మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే పలుమార్లు లేఖలు రాశారు. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొద్దిరోజుల క్రితమే దిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు.తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి కేంద్రం సహాయం అవసరమని సీఎం వివరించినట్లు సమాచారం. మెట్రో విస్తరణకు నోచుకోకపోవడంతో హైదరాబాద్‌లో నగరంలో ఎదురవుతున్న



ఇబ్బందులను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. విస్తరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పిన సీఎం, దీనికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రావాల్సిన రుణాన్ని త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని కోరారు. భేటీ సందర్భంగా ఈ ప్రాజెక్టు చుట్టూ ఏర్పడిన రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మెట్రో రెండో దశ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అయితే మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

## ఒవైసీ సోదరులకు భయమంటే ఏంటో చూపిస్తాం..

### హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, జులై 5 (ప్రభాత ఉదయం)**

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రాజకీయ అండతోనే ఒవైసీ బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలను కూడా గౌరవించకుండా, హైకోర్టునే బెదిరించేలా ఒవైసీ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అడ్డగోలుగా తప్పులు చేస్తూ మళ్లీ హైకోర్టునే ప్రశ్నిస్తారా? అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం నేతలకు కోర్టులు అన్నా, చట్టాలు అన్నా అస్సలు గౌరవం లేదని ధ్వజమెత్తారు. చెరువులను ఆక్రమించుకుని విద్యాసంస్థలను నిర్మించడమే ఒక పెద్ద తప్పని, దీనిపై హైకోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఒవైసీ ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఫాతిమా విద్యా సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోరెదపడం లేదని ఆయన నిలదీశారు.

**బీజేపీ వస్తే కూల్చివేతలు ఖాయం..**

గండిపేట ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న విద్యా సంస్థలకు కూల్చివేస్తామంటూ నోటీసుల మీద నోటీసులు ఇస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యా సంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం.. ఇతరులకు ఇంకో న్యాయమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఒవైసీ నేతృత్వంలోని

...మిగతా 2లో



మీ బెదిరింపులకు

## మేం లొంగం

2

విద్యాసంస్థలను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు

ఒకటి కూల్చితే వంద సంస్థలు కడతాం..

ఫాతిమా కాలేజీ అంశంపై అక్బరుద్దీన్ ఒవైసీ హాట్ కామెంట్స్

## ముంబై అస్తవ్యస్తం

### ముంచెత్తిన కుండపోత వర్షం

23 గంటల్లో 300 మి.మీ. వరకు వర్షపాతం... రెడ్ అలర్ట్ జారీ

లోతట్టు ప్రాంతాలు జలమయం

**ముంబై. జులై 5 (ప్రభాత ఉదయం)**

ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో నగరం అతలాకుతలమైంది. దీంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబైకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రానున్న గంటల్లోనూ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం ఉదయం 8 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విఖ్రోలి వెస్ట్‌లో 310.6 మి.మీ. వర్షం కురవగా, కొలాబా పంపింగ్ స్టేషన్ వద్ద 306.6 మి.మీ., టాగోర్ నగర్‌లో 301.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల ఇళ్లు కూలగా, చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లు, రైల్వే ట్రాక్‌లపైకి నీరు చేరడంతో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబర్బన్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ప్రజలను అప్రమత్తం చేసింది. అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించింది. సహాయం కోసం 1916 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపింది. ఆదివారం మధ్యాహ్నం 3:22 గంటలకు సముద్రంలో 4.19 మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. థానే, నవీ ముంబై, పాల్ఘర్ వంటి సమీప ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.




కాళేశ్వరం ప్రాజెక్టును సరిదిద్దే సత్తా

# కేసీఆర్‌కు ఉంది

పల్లపు నీరును ఎగువకు ఎక్కించిన ఘనత కేసీఆర్‌ది

అవగాహన లేక ప్రాజెక్ట్‌పై ఆరోపణలు చేయడం దుర్మార్గం

రూ. 94 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్ట్‌లో

లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**భూపాలపల్లి, జులై 5 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రానికి జలసౌదంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ను వినియోగంలోకి తీసుకురావడానికి చేతకాకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తప్పుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాలేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంప్ హౌస్ ను ఆదివారం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, మాజీ మాజీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించారు. కన్నేపల్లి పంప్ హౌస్ లో నీటి నిల్వను ఆయన పరిశీలించారు. అనంతరం పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో దశాబ్దాలుగా నీళ్ల కోసం పోరాటాలు సాగాయని ప్రతి ఏడాది గోదావరి నుండి వేలాది టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తూనే ఉందని అన్నారు. తెలంగాణ

...మిగతా 2లో




చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద .....

## ఘోర రోడ్డు ప్రమాదం

కారును ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ప్రమాదంలో మరొకరికి

తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

2

# కాళేశ్వరం ప్రాజెక్టును సరిదిద్దే సత్తా కేసీఆర్ కు ఉంది

మొదటి పేజీ తరువాయి..

భౌగోళిక పరిస్థితుల్లో గోదావరి, కృష్ణా నదులు ప్రవహిస్తున్న నీళ్లు కింద ఉండగా భూములు ఎత్తులో ఉన్నాయని, పల్లపు ప్రాంతంలో ప్రవహిస్తున్న నీరు ఎత్తుకు ప్రవహించేలా ప్రాజెక్ట్ నిర్మించిన ఘనత కేసీఆర్ ది అన్నారు. అలాంటి కేసీఆర్ కు ప్రాజెక్ట్ ను సరిదిద్దే సత్తా ఉందని ఒక వారం రోజులు తమకు ఇస్తే తాము ఏంటో చూపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం నీ పదవి, నీ కుర్చీ వద్దని తమకు రైతుల సంక్షేమం ముఖ్యమన్నారు. మండుటెండల్లోనూ, కరువు పరిస్థితుల్లోనూ నీటి లభ్యత ఉండే ప్రాంతంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని అన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్ హౌస్లు, సబ్ స్టేషన్లు, 1,531 కిలోమీటర్ల కాల్వల సమాహారమని వివరించారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగిపోయినా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని విమర్శించారు. ఆ బ్లాక్ లు పునర్నిర్మించడానికి రూ.400 కోట్లు సరిపోతాయని, ఎల్ అండ్ టీ ముందుకు వచ్చినా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టలేదన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అయింది.. అంటూ చేస్తున్న విమర్శలు అవాస్తవమని అన్నారు. కాళేశ్వరం ద్వారా కొత్తగా 40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగిందన్నారు. మూడు కాలాల పాటు నిలబడేలా ప్రాజెక్టును నిర్మించామని తెలిపారు. మిడ్ మానేరు నుంచి ఎక్కడికైనా నీటిని తరలించవచ్చని, ఫ్లడ్ ఫ్లో ద్వారా పంపులు ఆన్ చేయకుండానే నీటిని తరలించే అవకాశం ఉందన్నారు. కరువు పరిస్థితుల్లోనూ నీటి నిల్వ ఉండే ప్రాంతం కన్నెపల్లి అని పేర్కొన్నారు. ప్రస్తుతం 98 వేల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్నారు. మేడిగడ్డ అవసరం లేకుండానే కన్నెపల్లి నుంచి నీటిని తరలించవచ్చని చెప్పారు. కన్నెపల్లి వద్ద నీళ్లు ఉన్నప్పటికీ పంపులను ఆన్ చేయాలని రైతులు ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. మిడ్ మానేరు నింపాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కోరినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఎక్కడ నీటి లభ్యత లేకపోయినా కన్నెపల్లి నుంచే నీటిని ఎత్తిపోసే అవకాశం



ఉందన్నారు. ఎస్ఆర్ఎస్పీలోనూ నీరు లేకుంటే రివర్స్ పంపింగ్ ద్వారా నిల్వ చేసుకోవచ్చన్నారు. ఏడు జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించే ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పారు. కాకతీయ కాల్వల్లో నీళ్లు లేని సమయంలో నీటిని అందించింది కాళేశ్వరం ప్రాజెక్టేనని, అప్పర్ మానేరు అలుగు పొంగిందంటే దానికి కారణం కూడా కాళేశ్వరమేనని అన్నారు. హైదరాబాద్లో తాగునీటి అవసరాల కోసం ప్రస్తుతం రోజుకు 15 వేల వాటర్ ట్యాంకర్లు తిరుగుతున్నాయని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి రూ.94 వేల కోట్లు ఖర్చయితే, రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి సోయి లేదా? మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డికి స్పృహ లేదా? అని ప్రశ్నించారు. 2014కు ముందు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటలు ఎందుకు పండలేదని నిలదీశారు. సూర్యాపేట జిల్లాకు కాళేశ్వరం వచ్చిన తర్వాతే సాగునీరు అందిందన్నారు. కాళేశ్వరం వల్ల రైతుల జీవితం మెరుగుపడిందని, రాష్ట్రం అధిగమించి వరి ఉత్పత్తిలో పంజాబ్ ను అగ్రస్థానానికి చేరిందన్నారు. రైతుల ఆత్మహత్యలు కూడా గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అసమర్థత వల్ల ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది మృతి చెందారని, ఇప్పటికీ వారి మృతదేహాలను వెలికితీయలేని పరిస్థితి ఉందన్నారు. మీ హయాంలో సుంకిశాల గోడ కూలలేదా? వట్టెం పంప్ హౌస్ కొట్టుకుపోలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పై రాజకీయ కక్షతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కన్నెపల్లి గేట్లు ఎత్తితే నీరు వస్తుందని కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుసన్నారు. నీళ్లు ఇస్తే యూరియా ఇవ్వాలి, పంట పండితే మద్దతు ధర ఇవ్వాలి, విద్యుత్ ఇవ్వాలి, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఎన్డీఎస్ఏ, ఎన్డీఏలను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందన్నారు. రేవంత్రెడ్డి రాష్ట్రానికి పట్టిన శనేశ్వరంలా మారారని విమర్శించారు. కేసీఆర్ కు కాళేశ్వరం ప్రాజెక్టును వారం రోజుల పాటు అప్పగిస్తే తెలంగాణ అంతటికీ నీళ్లు పారించి చూపిస్తామని సవాల్ విసిరారు.మూడు నెలల క్రితమే ఎల్నినో, సూపర్ ఎల్నినో ప్రభావం ఉంటుందని చెప్పామని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కాళేశ్వరం ద్వారా హైదరాబాద్ తాగునీటితో పాటు ఉమ్మడి ఏడు జిల్లాలకు నీరు అందించే సామర్థ్యం ఉందన్నారు. హుస్సేన్సాగర్ సామర్థ్యం ఒక టీఎంసీ మాత్రమేనని, ఈ పంపుల సామర్థ్యం రెండు టీఎంసీల వరకు ఉందన్నారు. సాగునీటికే కాకుండా హైదరాబాద్ తాగునీటికీ సంక్షోభం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 50 వేల మంది రైతులతో కలిసి కన్నెపల్లి పంపులను ముట్టడించి ఆన్ చేయిస్తామని హెచ్చరించారు. రైతుల కోసం రూ.5 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.లక్ష కోట్లు, 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.50 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. కాళేశ్వరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులపై మొత్తం రూ.1.80 లక్షల కోట్లు వ్యయం చేశామని పేర్కొన్నారు. రైతుబంధు కోసం రూ.72 వేల కోట్లు, రైతుబీమా కోసం రూ.30 వేల కోట్లు అందించామని తెలిపారు. ఏ విధమైన సమగ్ర పరిశీలన చేయకుండానే 48 గంటల్లో ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని ఆరోపించారు. మేడిగడ్డ మరమ్మతులకు ఎల్ అండ్ టీ ముందుకు వచ్చినా ప్రభుత్వం వాటిని చేపట్టలేదని కేటీఆర్ విమర్శించారు. కేటిఆర్ వెంట మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, తదితరులు ఉన్నారు.



# ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్... బీజేపీ కంచుకోట నుంచి పోటీ

**బీహార్ బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీకి దిగుతున్న ప్రశాంత్ కిశోర్**

**దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గం ఇది**

**కిశోర్కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, ఆర్జేడీ నిర్ణయంపై ఉత్కంఠ**

**జులై 30న పోలింగ్, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు**

**న్యూఢిల్లీ, జులై 5 (ప్రభాత ఉదయం)**

ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. బీహార్లోని బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికలో ఆయన పోటీ చేయనున్నట్టు జన్ సురాజ్ పార్టీ (జేఎస్ పీ) చీఫ్ మనోజ్ భారతి ఆదివారం ప్రకటించారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి కిశోర్ బరిలో దిగుతుండటంతో ఆయన రాజకీయ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. బంకిపూర్ స్థానంలో బీజేపీ దశాబ్దాలుగా వరుస విజయాలు సాధిస్తోంది. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ, పార్టీ పూర్తి విశ్వాసంతో, శక్తియుక్తులతో ఈ ఉపఎన్నికలో పోరాడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఈ విజయమే పునాది వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "గత నాలుగేళ్లుగా జన్ సురాజ్ నా జీవితంగా మారింది. బీహార్లో మార్పు లక్ష్యం నెరవేరే వరకు ఇదే నా ధ్యేయం. బంకిపూర్ ఉపఎన్నికలో పోటీ చేసే బాధ్యతను ఆ లక్ష్యం దిశగా ఒక అడుగుగా భావిస్తున్నాను" అని కిశోర్ తెలిపారు. తనపై నమ్మకముంచిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బంకిపూర్ ఉపఎన్నికకు జులై 30న పోలింగ్ జరగనుండగా, ఆగస్టు 3న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో కిశోర్కు మద్దతిస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. అయితే, బీజేపీ కంచుకోటను బద్దలుకొట్టే ప్రయత్నంలో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) కూడా పీకేకు మద్దతు ఇస్తుందా లేదా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# ఒవైసీ సోదరులకు భయమంటే ఏంటో చూపిస్తాం..

మొదటి పేజీ తరువాయి..

సదరు విద్యా సంస్థ గతంలో మిలిటెంట్లకు షెల్టర్ ఇచ్చింది నిజం కాదా? అని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ విద్యార్థులకు చదువు చెప్పే ముసుగులో మిలిటెంట్లను తయారు చేస్తున్నారా? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేపు బీజేపీ అధికారంలోకి రాగానే అక్రమంగా కట్టిన ఫాతిమా విద్యా సంస్థలను కూల్చివేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. అక్రమార్కులకు, అవినీతిపరులకు భయమంటే ఏమిటో చూపిస్తామన్నారు. అయితే, ఆ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న అమాయక విద్యార్థుల భవిష్యత్తు చెడిపోకుండా, వారికి ప్రభుత్వం తరఫున ప్రత్యామ్నాయ విద్యావకాశాలను చూపిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

# మీ బెదిరింపులకు మేం లొంగం

**హైదరాబాద్, జులై 5 (ప్రభాత ఉదయం)**

ఫాతిమా కాలేజీ అంశంపై చాంద్రయణగుట్ట ఎమ్మెల్యే, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పందించారు. మా విద్యాసంస్థలను కూల్చివేస్తామని అంటున్నారని ఒక సంస్థను కూల్చేస్తే వందల విద్యా సంస్థలు కడతామన్నారు. విద్యాసంస్థలను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసన్నారు. మమ్మల్నీ భయపెట్టాలని చూస్తున్నారని ఇలాంటి బెదిరింపులు గతంలో చాలానే చూశామన్నారు. మీ బెదిరింపులకు మేం లొంగం అని హెచ్చరించారు. మేం అవినీతికి పాల్పడలేదని ఎలాంటి మోసాలు చేయలేదన్నారు. మా విద్యాసంస్థలు ఉన్నా లేకపోయినా విద్యార్థులకు చదువు చెప్పిస్తామన్నారు.

**వారం రోజులు గడువు విధించిన హైకోర్టు:**

కాగా చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కాపాడటమే లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా.. ఒవైసీ కుటుంబానికి చెందిన ఫాతిమా కాలేజీ సల్కం చెరువు ఎఫ్టీఎల్ లో నిర్మించారని దీన్ని తొలగిస్తామని గతంలో ప్రకటించింది. అయితే అక్కడ ఎలాంటి కూల్చివేతలు జరపకపోవడంతో ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్. పేదల కోసం పని చేస్తున్న కాలేజీ కాబట్టి సామాజిక కోణంలో ఆలోచించి చర్యలు తీసుకోలేకపోతున్నామని ప్రకటించారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పాతిమా విద్యాసంస్థల విషయంలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ హైకోర్టుకు కీలక వివరణ ఇచ్చింది. హైదరాబాద్ జిల్లా బండ్లగూడ మండలం బండ్లగూడ విలేజ్ సర్వే నెంబర్ 62లోని సల్కం చెరువు ఎఫ్టీఎల్లో కట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఒవైసీ విద్యాసంస్థకు ఎలాంటి అనుమతి లేదని పాఠశాల విద్యాశాఖ హైకోర్టుకు వెల్లడించింది. ఈ క్రమంలో భవన అనుమతులు, ఎఫ్టీఎల్ నిర్ధారణ తదితర అంశాలపై వారం రోజుల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆయా శాఖలను ఆదేశించింది. లేనిపక్షంలో ఈనెల 9వ తేదీ వరకు అందుబాటులో ఉన్న సమాచారంతోనే ఉత్తర్వులు జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో అక్బరుద్దీన్ ఒవైసీ పై వ్యాఖ్యలు చేయడం ఆసక్తిగా మారింది.

## అయోధ్య రామమందిర విరాళాల కేసులో

# దోషులకు కఠిన శిక్ష పడాలి

## మోహన్ భాగవత్

**న్యూఢిల్లీ, జులై 5 (ప్రభాత ఉదయం)**

అయోధ్య రామ మందిర విరాళాల అవకతవకలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన తీవ్రంగా ఖండించదగినదని, దోషులను కఠినంగా శిక్షించాలని ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే చేసిన ప్రకటననే ఆయన బలపరిచారు. ఇంతకు మించి అదనపు వ్యాఖ్యలు చేయడానికి ఆయన నిరాకరించారు. 'సన్మార్గ్ మైండ్ వెల్నెస్' ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన, ఒక రోజు క్రితం ఆర్ఎస్ఎస్ విడుదల చేసిన అధికారిక ప్రకటనను చూడాలని కోరారు. శుక్రవారం హోసబలే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "తరాల పోరాటాలు, కోట్ల మంది రామభక్తుల అంకిత భావం, త్యాగం, బలిదానాల వల్ల శ్రీరామ జన్మభూమిపై నిర్మించిన ఈ అద్భుత ఆలయం యావత్ హిందూ సమాజానికి భక్తి, శ్రద్ధ, విశ్వాసాలకు కేంద్రంగా మారింది. అయితే ఈ ఆయోధ్య రామమందిరంలో ఉంచిన విరాళాల దొంగతనం ఒక దురదృష్టకర ఘటన. ఇది మొత్తం సమాజం, రామభక్తుల మనోభావాలను, భక్తిని గాయపరిచింది. మనందరినీ ఎంతగానో గాయపరిచింది. ఇది తీవ్రంగా ఖండించదగినది. కనుక దర్యాప్తులో దోషులుగా తేలిన ఎవరికైనా కఠినమైన శిక్ష పడేలా చూడడం అత్యవసరం" అని అన్నారు. మరోవైపు అయోధ్య రామ మందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసు రాజకీయంగా మరింత వేడెక్కుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ తాజాగా బీజేపీ, ఆర్ఎస్ఎస్లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. మరోవైపు విశ్వ హిందూ పరిషత్ (VHP) ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలపైనా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది.



# బంగాళాఖాతంలో వాయుగుండం.. ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

**వాయుగుండంగా మారిన అల్పపీడనం**

**ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరంలో కేంద్రీకృతం**

**24 గంటల్లో బాలాసోర్ వద్ద తీరం దాటే అవకాశం**

**ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్**

**మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక**

**హైదరాబాద్, జులై 5 (ప్రభాత ఉదయం)**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఈ వాయుగుండం ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఒడిశాలోని బాలాసోర్కు 50 కిలోమీటర్ల దూరంలో, చాంద్బలి, దిఘాలకు చెరో 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో చాంద్బలి-దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలోని ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాయుగుండం కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

## చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద .....

# ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి..

నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయరహదారిపై హైదరాబాద్ వెళ్తున్న కారును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న 8 ఏళ్ల బాలుడు సహా నలుగురు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ను నార్కట్పల్లిలోని కామినేని ఆసుపత్రికి ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతివేగంగా ఢీకొట్టడంతో : నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులోని జాతీయ రహదారి 65 పై ఉన్న యూటర్న్ వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్బీఐ ఉద్యోగి ప్రసాద్ భార్య, కుమార్తె (15), కుమారుడు(10), ప్రసాద్ స్నేహితుడు శ్రీకర ప్రసాద్(62) మృతులుగా గుర్తించారు. వీరు ఏపీలోని కాకినాడ జిల్లా వాసులుగా గుర్తించారు. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును పెద్దకాపర్తి శివారులోని పెద్ద చెరువు కట్ట సమీపంలోని యూ టర్న్ వద్ద కారును వెనుక నుంచి విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సు, కారును వెనుక నుండి అతివేగంగా ఢీకొట్టడం మూలంగా కారు పల్టీలు కొట్టి నుజ్జునుజుగా మారింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది ఏళ్ల బాలుడి సహా నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు : ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న వ్యక్తులను బయటకు తీసేందుకు పోలీసులు తీవ్రంగా కష్టపడ్డారు. గ్యాస్ కట్టర్ మెషిన్ సహాయంతో కారు భాగాలను కట్ చేసి అందులోని వ్యక్తులను బయటకు తీశారు. అనంతరం వారిని పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ను చికిత్స నిమిత్తం నార్కట్పల్లి కామినేని ఆసుపత్రికి తరలించినట్లుగా ఎస్సై రవికుమార్ తెలిపారు.

జాతీయ రహదారిపై ఈ ప్రమాద సంఘటన జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. సంఘటన స్థలాన్ని నార్కెట్పల్లి సీఐ సురేష్ సందర్శించి పరిశీలించాడు. అతివేగమే ఈ సంఘటనకు గల ప్రధాన కారణమా? మరి ఏదైనా ఉందా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కారు చెన్నై నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం చోటుచేసుకోగా బస్సు బలంగా ఢీకొట్టడంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. మృతులు ఏపీలోని కాకినాడకు చెందిన వారుగా గుర్తించారు. ప్రస్తుతం ఈ కుటుంబం హైదరాబాద్లో ఉంటున్నట్టు సమాచారం. ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్యాస్ సరఫరాపై అత్యవసర ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం

**సహజవాయువు సరఫరాపై అత్యవసర ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేత**

**హర్మూజ్ జలసంధి మీదుగా ఎల్ఎన్జీ నౌకల రాకపోకలు తిరిగి ప్రారంభం**

**పశ్చిమాసియా సంక్షోభం కారణంగా మార్చి 9న ఈ ఆంక్షలు విధింపు**

**తాజా నిర్ణయంతో పరిశ్రమలు, గ్యాస్ వినియోగదారులకు ఉపశమనం**

**న్యూఢిల్లీ, జులై 5 (ప్రభాత ఉదయం)**



సహజవాయువు సరఫరాపై విధించిన అత్యవసర ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. పశ్చిమాసియా నుంచి హర్మూజ్ జలసంధి ద్వారా ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్జీ) రవాణా తిరిగి సాధారణ స్థితికి చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. ఈ మేరకు 'నేచురల్ గ్యాస్ (సరఫరా నియంత్రణ) ఆర్డర్, 2026'ను సవరించినట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి మార్గంలో ఎల్ఎన్జీ నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సరఫరా సంస్థలు 'ఫోర్స్ మేజర్' ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది మార్చి 9న కేంద్రం అత్యవసర నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దేశీయ గ్యాస్, దిగుమతి చేసుకున్న ఎల్ఎన్జీని గృహ అవసరాల (పీఎన్జీ), రవాణా రంగం (సీఎన్జీ), ఎల్పీజీ ఉత్పత్తి, ఎరువుల కర్మాగారాల వంటి కీలక రంగాలకు మాత్రమే కేటాయించింది. పెట్రో కెమికల్స్, విద్యుత్ ప్లాంట్ల వంటి ప్రాధాన్యత లేని రంగాలకు సరఫరాలో కోతలు విధించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో కాల్పుల విరమణ అమలు, శాంతి చర్చలు జరుగుతుండటంతో పరిస్థితులు చక్కబడ్డాయని, సముద్ర మార్గంలో రవాణా సాధారణ స్థితికి చేరుకుందని మంత్రిత్వ శాఖ వివరించింది. అందుకే, అత్యవసర చర్యలు ఇక అవసరం లేదని పేర్కొంది. సంక్షోభ సమయంలో విధించిన మూడు అత్యవసర నిబంధనల్లో ఇది చివరిది. ఇప్పటికే రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలన్న ఆదేశాలను, బల్క్ డీజిల్ అమ్మకాలపై ఆంక్షలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తాజా నిర్ణయంతో పరిశ్రమలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, ఇతర వినియోగదారులపై ఒత్తిడి తగ్గనుంది. ఇకపై గ్యాస్ కేటాయింపులు సాధారణ వాణిజ్య ఒప్పందాల ప్రకారం కొనసాగుతాయి.

# ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

**ప్రజలది నకిలీ ఏడుపు కావచ్చని అనుమానం వ్యక్తం చేసిన ట్రంప్**

**ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఇరాన్**

**సువాసనను చంపలేరంటూ ఇరాన్ ఘాటు కౌంటర్**

**న్యూఢిల్లీ, జులై 5 (ప్రభాత ఉదయం)**



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఖమేనీ కోసం ప్రజలు కన్నీరుపెడుతుండడంపై స్పందిస్తూ.. అవి 'దొంగ ఏడుపులు' కావచ్చని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికాకు నాగరికత, చరిత్ర లేవంటూ ఘాటుగా బదులిచ్చింది. యాక్సియోస్కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. ఖమేనీ అంత్యక్రియలకు భారీగా జనం తరలిరావడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. ప్రజలు ఖమేనీని ద్వేషిస్తారని తాను భావించానని, ఇప్పుడు కనిపిస్తున్నది నకిలీ శోకం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇరాన్ ఉన్నత నాయకత్వం మొత్తం ఒకేచోట ఉందని, వారిని ఒక్క దెబ్బతో లేపేయగలమని, కానీ తర్వాత చర్చలు జరపడానికి ఎవరూ మిగలరనే ఉద్దేశంతోనే అలా చేయడం లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై అర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందించింది. "వ్యక్తులను చంపగలరు, కానీ వారి ఆశయాలను చంపలేరు. మీరు అయతొల్లా ఖమేనీని చంపారు. కానీ నిజానికి మీరు ఒక సుగంధ ద్రవ్యాల సీసాని పగలగొట్టారు, దాని సువాసన ఇప్పుడు ప్రతిచోటా వ్యాపించింది" అని పేర్కొంది. అమెరికాకు నాగరికత, చరిత్ర, గౌరవం లేవని విమర్శించింది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. టెహ్రాన్లో ఆయన అంత్యక్రియలకు లక్షలాది మంది హాజరవుతూ "అమెరికాకు మరణం" అంటూ నినాదాలు చేస్తున్నారు. మరోవైపు, ఇరాన్ సంతాప దినాలు ముగిశాక ఇరు దేశాల మధ్య చర్చలు పునఃప్రారంభం అవుతాయని ట్రంప్ సూచనప్రాయంగా తెలిపారు.

# ఎస్ఐఆర్ దరఖాస్తులను ఓటర్లు విధిగా పూర్తి చేయాలి

**మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్**

**ప్రతి ఓటరు ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఓలు, బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకం**

**రాజేంద్రనగర్, జూలై 5(ప్రభాత ఉదయం)**

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ప్రజలకు అవగాహన కనిపించారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి కాటేదాన్ డివిజన్ లో ఎస్ ఐ ఆర్ పై అవగాహన కార్యక్రమం, ఓటర్లకు ఇమ్రేషన్ ఫామ్ పంపిణీ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అని, కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా బీఎల్ఓలు, బీఎల్ఏలు సమగ్ర సమాచారం సేకరించి ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా ప్రతి ఓటరికి అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుంటున్నందున, అప్పటి ఓటర్ల వివరాలు, ప్రస్తుతం వారి ఓటు హక్కు ఎక్కడ నమోదై ఉందనే సమాచారాన్ని ప్రజలు బీఎల్ఓలు, బీఎల్ఏలకు అందించాలని కోరారు.



తద్వారా సమగ్ర, పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించడంలో అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మృతి చెందిన వారి ఓట్లు , డూప్లికేషన్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్ల గుర్తింపులో ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా పూర్తి చేసే అవకాశం కల్పించడం ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్వచ్ఛందంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఆర్ఎస్ నాయకులు చురుకుగా పాల్గొంటూ బిఎల్వో లు, బిఎల్ఏలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలను ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంపై చైతన్య పరచాలి. ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించడం ప్రజలతో పాటు బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉన్న అత్యంత బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరికి రెండు ఫారంలు ఇవ్వడం జరుగుతుంది వారు ఎలా నింపాలో తెలియక దాన్ని తప్పుగా నింపి బిఎల్ లో కి ఇవ్వడం జరుగుతుంది. అక్కడికి వచ్చిన తర్వాత ఫాము లు తప్పు నింపారని సమాచారం తెలియడంతో ఓటు కోల్పోయే ప్రమాదం ఉంది కాబట్టి అధికారులు స్పందించి ఈ ప్రక్రియను సక్రమంగా జరిగేటట్టు చూడాలని కాటేదాన్ డివిజన్ ఎతీం పార్టీ అధ్యక్షులు వెంకటేష్ కోరడమైనది ప్రతి ఓటర్ కు ఇమ్రేషన్ ఫారంలు అదేవిధంగా చూడాలి కొందరు దీూా లు తమ విధులు సక్రమముగా నిర్వహించడం లేదని, ఫోన్లు లిఫ్ట్ చేయటం లేదని పత్రాల పరిశీలన సరిగ్గా జరగటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బి ఎల్ ఓ లకు తగు సూచనలు చేయాలని, అదేవిధంగా విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న బి ఎల్ ఓ లను సత్వరమే బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోరాఘవరెడ్డి



శ్రీకాంత్ తో పాటు బి ఎల్ ఓ లు అనిత హేమలత గీత కనకవ్వ మాధవి జయప్రకాష్ నాగలక్ష్మి పారిజాత , వెంకటరమణ గుప్త, కొంపల్లి జగదీష్, కిలరీ వెంకటరమణ ,ఉప్పల్ శ్రీను, ప్రసన్న ,పద్మ, బొంబాయి రవి ,సంతు, కురుమప్ప, సంతోష్, శివ, టీవీఎస్ శివ , బి ఎల్ ఓ, బి ఎల్ ఏ లు, ఓటర్లు చురుకుగా పాల్గొన్నారు.




ప్లాస్టిక్ వాడొద్దు అంటు సుహాసిని వేసిన చిత్రం..




9వ తరగతి విద్యార్థిని సుహాసిని

## ప్లాస్టిక్ వాడొద్దు అంటు సువాసిని గీసిన చిత్రానికి ప్రధమ బహుమతి

**బుద్వేల్, జూలై 5 (ప్రభాత ఉదయం)**

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో 9వ తరగతి ఏ సెక్షన్ చదువుతున్న సువాసిని ప్లాస్టిక్ వాడొద్దు.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే అంశంపై చిత్రం గీశారు. ఆ చిత్రానికి పాఠశాలలో ప్రధమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా సువాసిని ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.




ఉచిత వైద్య శిభిరం లో పాల్గొన్న డాక్టర్లు, రోగులు, నాయకులు, నిర్వాహకులు

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**బుద్వేల్, జూలై 5 (ప్రభాత ఉదయం)**

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం అందరం కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్నేహాంజలి వెల్ఫేర్ అకాడమి అధ్యక్షురాలు పచ్చ అనిత అన్నారు. స్నేహాంజలి వెల్ఫేర్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ లోని మహిళా మండలి భవనం ఆవరణలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆమె స్థానిక నాయకులు వై.శ్రీధర్, ఎం యాదమ్మ యాదవ్, దుంబాల ఝాన్సీరెడ్డి, క్యాసారం శంకర్ రావు, పంబాల రాజు, పచ్చ నర్సింగ్ రావు, వేముల శ్రీనివాస్, దుంబాల ఉ మారెడ్డి లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ బోన్, జాయింట్ క్యాంప్, డయాబెటిక్ క్యాంపు లను నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది వరకు పాల్గొని వైద్య సేవలు పొందారు. డాక్టర్ పాశం ఇంద్రసేన్రెడ్డి, డాక్టర్ సయ్యద్ మోహిదుద్దీన్ లు రోగులను పరిశీలించి మందులను పంపిణి చేశారు.



ప్రతిభావంతులైన విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేసి మెమెంటో లను బహుకరించిన నిర్వాహకులు

## ప్రతిభావంతులైన విద్యార్థులకు అకాడమిక్ ఎక్సలెన్స్ స్కాలర్షిప్‌లు అందించిన ఏరీస్ ఆగ్రో సంస్థ

**బుద్వేల్, జూలై 5 (ప్రభాత ఉదయం)**

వ్యవసాయం, ఆక్వాకల్చర్, వ్యవసాయ పరికరాల రంగాల్లో ప్రముఖ సంస్థ అయిన ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ తన ప్రతిష్టాత్మక ఏరీస్ ఫ్యూచర 2026 దక్షిణ భారత సేల్స్, మార్కెటింగ్, అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ లీడర్షిప్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ లోని తెలం గాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించింది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ కు చెందిన ఎనిమిది మంది ప్రతిభావం తులైన విద్యార్థులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో బాగంగా రూ.47,500 విలువైన స్కాలర్షిప్ ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ మీర్ చందానీ, మార్కెటింగ్ డైరెక్టర్ జె.పి సుబ్రమణ్యం లు హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రధానం చేశారు.





తెలంగాణ తొలి శాసన మండల చైర్మన్ కే స్వామి గౌడ్ ను జన్మదినం సందర్భంగా సన్మానిస్తున్న అభిమానులు

## ఘనంగా తెలంగాణ తొలి శాసనమండలి చైర్మన్ కే స్వామి గౌడ్ జన్మదిన వేడుకలు

**స్వామి గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, వివిధ పార్టీ నాయకులు**

**రాజేంద్రనగర్, జూలై 5 (ప్రభాత ఉదయం)**

తొలి తెలంగాణ శాసన మండలి చైర్మెన్ శ్రీ కనకమామిడి స్వామి గౌడ్ జన్మదినం వేడుకలు ఆదివారం ఘనంగా వివిధ పార్టీల నాయకులు, అభిమానులు నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ డివిజన్ సీనియర్ నాయకుడు శ్రీ ఎడ్లకాడి సూర్యం, డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంత్ ఉత్సవాల వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ దళిత నేత పోయిల జీవన్ దాస్,గోల్కొండ లేవి రాజ్,చంద్ర శేకర్,అనిల్ కుమార్,నాని,డేవిడ్,జనార్దన్,గౌతమ్,హరీష్,నరేష్ తదితరులు ఉన్నారు.







టెక్వండో మార్షల్ ఆర్ట్స్ బెల్టుల ప్రదానోత్సవం లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

## ఒలంపిక్స్‌లో స్వర్ణ పతకం సాదిస్తాం

**టేక్వండో మార్షల్ ఆర్ట్స్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్**

**బుద్వేల్, జూలై 5 (ప్రభాత ఉదయం)**

లాస్ ఏంజిల్స్ లో 2028 లో జరిగే ఒలంపిక్ గేమ్స్ లో మార్షల్ ఆర్ట్స్ లో స్వర్ణ పథకం సాధించే ప్రయత్నం చేస్తామని టేక్వండో మార్షల్ ఆర్ట్స్ తెలంగాణ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ డివిజన్ పెద్ద తాళ్లకు టలో ఆదివారం ఉదయం జరిగిన టేక్వండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ టేక్వండో అసోసియేషన్ బృందం ఆధ్వర్యంలో టేక్వండో స్టూడెంట్స్ కు కలర్ బెల్టులు బహుకరించారు. ముఖ్య అతిథిగా పెద్ద తాళ్లకుంట పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బర్ల జంగయ్య, ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్, లీగల్ అడ్వయిజర్ మల్లికార్జున్ రెడ్డి , సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధుసూదన్, తెలంగాణ టేక్వండో అసోసియేషన్ ప్రతినిధి ప్రదీప్ కుమార్ లు మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్ లో ప్రావీణ్యం పొందిన అత్తాపూర్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ఒలంపిక్ ఆటలో స్వర్ణ, వెండి పథకాలను సాదించాలని ఆకాంక్షించారు. మార్షల్ ఆర్ట్స్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిం చారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్.. యువకుడు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 5(ప్రభాత ఉదయం)**

విద్యుత్ స్తంభాన్ని ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం గట్టు మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...గట్టు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన కుర్వ గోవర్ధన్(18), బోయ ఈశ్వర్ ఇద్దరు కలిసి ఆదివారళ ఉదయం ద్విచక్ర వాహనంపై పెంచికలపాడు చెరువుకట్ట మీదుగా ఊర్లోకి వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో గోవర్ధన్ మార్గ మధ్యలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వర్ ను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించారు






## రోడ్డు పక్కనే ప్రమాదకరంగా హోర్డింగ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 5(ప్రభాత ఉదయం)**

గద్వాల నియోజకవర్గం లో ఏర్పాటు చేసిన హోర్డింగ్ లు భయపెడుతున్నాయి. గద్వాల మండలం గోనుపాడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై అనుమతి లేని హోర్డింగ్ ఏర్పాటు చేశారు. ఇనుముతో చేసిన హోర్డింగ్ ఏర్పాటు చేయడంతో ప్రమాదవశాత్తు వాహనదారులు అదుపుతప్పి హోర్డింగ్ కు తగిలితే ప్రాణాలు గాల్లో కలిసిపోయే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

# పదవి విరమణ చేసిన పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ ఆగన్న చంద్రారెడ్డి సన్మానించిన అధికారులు, బంధువులు




### విధి నిర్వహణలో చంద్రారెడ్డి సేవలు ఎనలేనివి: మండల సీనియర్ నాయకులు ఎం భీమ్ రెడ్డి

**కొత్తకోట, జూలై 5(ప్రభాత ఉదయం)**

నాగర్ కర్నూల్ జిల్లా చిన్నంబావి మండలానికి చెందినఆగన్న గారి చంద్రారెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పోలీస్ శాఖకు సుధీర్ గంగా సేవలందించి వనపర్తి జిల్లా కొత్తకోట మండల ము ఆనంద్ ఫంక్షన్ హాల్ లో డిపార్ట్మెంట్ కి చెందిన అధికారులు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా రిటైర్మెంట్ ఫంక్షన్ జరిగింది. పోలీస్ శాఖలో దినచర్య కష్టాలకు దగ్గర్లో సుఖాలకు దూరంగా అపాయాలను ఎదుర్కొని ప్రజా క్షేమమే ధ్యేయంగా విధులు నిర్వహించడం మాబాధ్యతగా విధులు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రత్నం కొత్తకోట సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శివానంద గౌడ్ వనపర్తి రూరల్ ఎస్సై రిషికేశ్ వారి సుదీర్ఘ అనుభవాలు చంద్రా రెడ్డి చేసిన సేవలను కొనియాడారు . చంద్రా రెడ్డి సన్నిహిత బంధువులు మూలమల సత్యనారాయణ రెడ్డి , మూలమల్లరాజేశ్వరి భీమ్ రెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ వనపర్తి రోడ్డు, ఎం చక్రగిరి వర్ధన్ రెడ్డి కోపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్ ఎం పల్లవి ఎం రమేష్ రెడ్డి ఏటీఎం సోమాలియా టైల్స్ ఎం రాణి పి మహేందర్ రెడ్డి విహారిక ఎం ఇంద్ర తేజ రెడ్డి పదవి విరమణ చేసిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ అగన్న గారి చంద్రారెడ్డి ఆగన్న గారి విజయలక్ష్మి దంపతులకు సిఐఎస్ఐ పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులు సిబ్బంది, బంధుమిత్రులు దంపతులను ఘనంగా సన్మానించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం రమేష్ రెడ్డి ,ఏజీఎం సోమాలియా టైల్స్ ఎం రాణి, పి మహేందర్ రెడ్డి ఎం విక్రమ్ సింహారెడ్డి, విహారిక , యం ఇంద్ర తేజ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు



## అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు సొంత భవనాన్ని నిర్మించాలి: సిపిఎం డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 5(ప్రభాత ఉదయం)**

అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు సొంత భవనాన్ని నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నరసింహ డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను,ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి, కళాశాల వసతి గృహాలను,ఓపెన్ డిగ్రీ విద్యార్థులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపివేసిన విద్యార్థులు కోసం,అనాథ విద్యార్థుల కోసం ఉపయోగపడే అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల వసతి గృహానికి సొంత భవనం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం డిఆర్డిఏ కు సంబంధించిన భవనంలో ఉన్నారని ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విషపురుగులు సంచరిస్తున్నాయని, గతంలో విద్యార్థులు విషపురుగులు బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. హిందీ టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నట్టు తమ దృష్టికి తెచ్చారన్నారు.ప్రస్తుతం 110 మంది విద్యార్థులు ఉన్న ఈ రెసిడెన్షియల్ లో నాలుగు నుండి 8 తరగతి వరకు మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారని, సొంత భవనాన్ని నిర్మించితే పదవ తరగతి వరకు విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఎస్టీ బాలుర వసతి గృహ విద్యార్థులకు ఇప్పటివరకు నోట్ పుస్తకాలు అందలేదని తెలిపారు. బాలుర వసతి గృహం పక్కన ఉన్న మురుగు కాల్వ వల్ల విద్యార్థులు తీవ్ర దుర్వాసన వచ్చి రోగాల బారిన పడుతున్నట్లు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు.జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహం పూర్తిగా శిథిలావస్థలో ఉన్నదని ఎప్పుడు కులుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్నదని తక్షణమే నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే భవనంలో అక్కడక్కడ పెచ్చులు ఊడుతున్నాయని విద్యార్థులకు ఏటువంటి ప్రాణహాని జరిగినా అధికారం యంత్రాంగం, ప్రభుత్వానికి బాధ్యత అని హెచ్చరించారు.ఎ బాలుర కళాశాల వసతి గృహంలో మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ ప్రారంభించలేదని, తీవ్ర మంచినీటి సమస్య ఉందని విద్యార్థులు తమ దృష్టికి తెచ్చినట్టు తెలిపారు.జిల్లా కేంద్రంలోని ఓపెన్ డిగ్రీలో కేవలం ఆర్ట్స్ వారికి మాత్రమే క్లాసులు జరుగుతున్నాయని సైన్స్ విద్యార్థులు తరగతుల కోసం మహబూబ్ నగర్ కు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా కేంద్రంలో ఓపెన్ పీజీని ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువస్తే పీజీ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం ఉండదని తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, బషీర్,ఎల్లప్ప పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### బస్సును ఢీ కొట్టిన లారీ.. పలువురికి గాయాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 5(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలోని మానవపాడు స్టేజ్ సమీపంలో జాతీయ రహదారి 44 పై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

ప్రమాద వివరాలు: హిందూపురం నుండి హైదరాబాద్‌కు 22 మంది ప్రయాణికులతో బయలుదేరిన 'మార్నింగ్ స్టార్' సంస్థకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, మానవపాడు స్టేజ్ వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. అనంతపురం నుండి జమ్మూ కాశ్మీర్ వైపు వెళ్తున్న లారీ, ప్రైవేట్ బస్సు వెనుక భాగాని ఢీకొట్టడంతో బస్సు అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను వెలికితీసి, గాయపడిన 10 మంది ని వైద్యం కోసం అంబులెన్స్ లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మానవపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నందిన్నె గ్రామంలో వైభవంగా శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం





**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 5(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ మరియు బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేక హోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అభిషేకాలతో స్వామివారికి విశేష పూజలు చేశారు. లగ్న ముహూర్తాన భక్తుల జయజయధ్వానాల మధ్య ధ్వజస్తంభాన్ని, బొడ్రాయిని ప్రతిష్ఠించారు. గతంలో ఈ పురాతన ఆంజనేయస్వామి ఆలయాని గ్రామస్తులు అందరి సహకారంతో విరాళాలు సేకరించి, ఆలయానికి ఘనంగా జీర్ణోద్ధారణ పనులు చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన గ్రామస్తులు, అందులో భాగంగానే నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను అత్యంత వైభవంగా పూర్తి చేశారు.ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి నందిన్నె గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తజనసందోహంతో, శ్రీఅంజన్న నామస్మరణతో మారుమోగాయి. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

### ధ్వజ స్తంభం, బొడ్రాయి మహోత్సవాలలో పాల్గొన్న ప్రముఖులు

నందిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నందిన్నె ప్రకాష్ రావు ,బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ బాసు హన్మంతు నాయుడు నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకొని సన్మార్గంలో పయనించాలని సూచించారు



## కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం..

### నమ్మించి మోసం చేసిన బిల్డర్ పైన కఠిన చర్యలు..

### అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి..

### ఎవ్వరు అడ్డు వచ్చినా వెనక్కు తగ్గేది లేదు..

### ప్రతి ప్లాట్ యజమానికి సంపూర్ణ న్యాయం..

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూలై 5 (ప్రభాత ఉదయం)**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల యజమానుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం కొల్లూరులో లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984వ సంవత్సరంలో కొల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 173 నుండి 190 పరిధిలోగల 142 ఎకరాలలో భవిష్యత్తు అవసరాల కోసం 1500 ల మంది వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్లాట్లు కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. తదనంతరం కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో తిరిగి ప్లాట్లను అమ్మడంతో పాటు, ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం అన్నారు. బిఎల్ ప్రసాద్ అనే ప్లాట్ యజమాని సభ్యులందరినీ మోసం చేసి ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను కబ్జా చేసి హెచ్ఎండిఏ అనుమతులతో నిర్మాణాలు కొనసాగించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ తో పాటు, సిటీ ప్లానర్, హెచ్ఎండిఏ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లి అనుమతిని రద్దు చేయించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. రూపాయి రూపాయి పొదుపు చేసి ప్లాట్లను కొనుగోలు చేస్తే, నేడు కొందరు భూ ఆక్రమణదారులు ఇలాంటి చర్యలకు పాల్పడం సిగ్గు చేటని విమర్శించారు. ఈ ఆక్రమణల్లో ఎంతటి పెద్దవారు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ప్రతి ప్లాట్ యజమానికి పూర్తి న్యాయం దక్కేవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి ప్లాటు సభ్యుడు సమిష్టిగా పోరాటం చేసినప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నరసింహ, యాదయ్య, వెంకట్రాంరెడ్డి, మధు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను జయప్రదం చేయాలి

### కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి

**పటాన్ చెరు, జూలై 5 (ప్రభాత ఉదయం):**

బొల్లారం డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తి కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవ ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.చంద్రారెడ్డి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో అమ్మవార్ల విగ్రహాలతో పాటు, ధ్వజస్తంభ శిఖర విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ప్రతిష్టాపన ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులతోపాటు చంద్రారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జైపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## తాళం వేసిన ఇంట్లో చోరీ

**గద్వాల జిల్లా ప్రతినిధి. జూలై 5(ప్రభాత ఉదయం)**

వడ్డేపల్లి మండలం తనగల గ్రామంలో ఆదివారం భారీ దొంగతనం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన జి.అశోక్ కుమార్ అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అశోక్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వనపర్తి జిల్లాకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున బాధితుడు ఇంటికి రాగ ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలో ఉన్న సుమారు నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు,8 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు గుర్తించాడు. ఈ ఘటనపై బాధితుడు శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని శాంతినగర్ సీఐ బండారి శంకర్, ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ బృందం పరిసర ప్రాంతాలు పరిశీలించాయి. అనంతరం క్లూస్ టీం ద్వారా పలు కీలక ఆదారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు.